# కొమ్ములు

"నడీదిగంగమ్మ జాతర జేస్తా ఉండాం! వొకే అబ్బారే! వొచ్చి నాలుగు దినాలుండేసి పోరా. వొచ్చేటప్పుడు మర్చిపోకుండా నీ పెండ్లాం పిలకాయిల్ని కూడా పిల్సుకోనిరా. మీ కొండారెడ్డి మామ వొచ్చి కూసున్నాడు. ఏడూళ్లు ఏకమైనాయి. ఈ తడవ జాతర బెమ్మాండంగా జరపాలంటా ఉండా(రా!" అని మా అయ్య వొక్కాముక్కల రాయించిన జాబు తేనెతుట్టె లేపినట్లు తలనిండుకు ఆలోచనల్ని లేపింది.

మాఊళ్లో నడివీధిగంగమ్మ జాతర...! నిజంగా వొంటిమీద పెగ్గలేకుండా జరపతారు. అందులో ఏడూళ్లూ ఏకమైనాయట! సముద్రజలాలతో చక్కెర తయారు చేయవచ్చునని శాస్త్రజ్ఞులు చాటినా నమ్మచ్చునేమో కానీ - ఆ పాయకట్టులో ఏడూళ్లూ ఏకమైనాయంటే నమ్మశక్యం కాలేదు. బహుశా రాకరాక వచ్చిన కొండారెడ్డి మామ రాక దీనికి కారణమై ఉంటుందేమో?

కొండారెడ్డి మామ సాధారణంగా రాడు. వస్తే ఊరికే పోడు. అంటే - కొండారెడ్డి మామ కొండంత మనిషీ కాదు. కోర మీసమూ లేదు. మీసానికి రోషానికి ముడి-సంక్రాంతికి సాహెబ్‌కు అనుకొంటే మామ మంచి రోషగాడు. ఆ రోషం టార్చిలైట్ వేసి వెదికినా కండ్లలో కనిపించదు. కార్యంలో గోచరించదు.

అదే కొండారెడ్డి మామ ప్రత్యేకత!

కొండారెడ్డి మామ కోర్టు దగ్గర కనిపిస్తాడు. ఉరిశిక్ష తప్పదనుకునే వాడికి కనీసం జైలుశిక్ష కూడా పడదు.

కొండారెడ్డి మామ ఎన్నికల సమయాల్లో దర్శనమిస్తాడు. ఎన్ని కలలోకంటున్న వాడికి డిపాజిట్ కూడా రాకపోవడం...డిపాజిట్ కూడా రాదనుకొన్నవాడు ఏకంగా గెలిచి ఎగిరి గంతేయడం మామ దర్శనానికి నిదర్శనం!

కొండారెడ్డి మామ అన్నదమ్ముల భాగ పరిష్కారాల్లో తల దూర్చుతాడు. ఒకడి కొంప

కొళ్లబోతొంది. ఇంకొకడి కొంప కొండెక్కి కూర్చుంటుంది.

అయితే మనిషిని చూస్తే ఎవరైనా 'ఇవన్నీ లేత సొరకాయ కోతల్లేరా!' అని కొట్టి పారేస్తాడు. ఆ అవతారం అట్లాంటిది మరి?

కొండారెడ్డి మామ చెక్కిన చెక్క పేడులా బక్క పలచగా ఉంటాడు. ముక్కు కూచిగా ముందుకు సాగి ఇందిరాగాంధీ ముక్కు మాదిరి ముందు కొంచెం వంగి ఉంటుంది. లొక్కి దవడల్తో పోటీపడ్తూ లోతుకుపోయిన కండ్లు మిలమిల మెరుస్తుంటాయి. ఒక అడ్డ పంచె అరవకట్టు కట్టుకొని అరచొక్కా తొడుక్కొని రెండు మూర్ల తుండుగుడ్డ భుజాన వేసుకొని సాదా సీదాగా తిరిగే మనిషి ఘటనా ఘటన సమర్థుడంటే నమ్మడం కష్టమే!

అయినా ఇది అక్షరాలా నిజం.

పుట్టి బుద్ధెరిగిన నాటి నుండి మా ఊళ్లో జాతర నేను చూస్తున్నదే! అయితే కొండారెడ్డి మామ లీలల్ని మాత్రం వినడమే కాని చూడటానికి అవకాశం లేకపోయింది. వినినపుడు మాత్రం కొండారెడ్డి మామ ఒకానొక దొంగల ముఠాకు నాయకుడైతే?...ఒకానొక రాజకీయ పార్టీని లేవదీస్తే? అని అనిపిస్తూ ఉంటుంది. అయితే ఎందుకో కానీ కొండారెడ్డి మామ తన కీర్తిని జాతీయ స్థాయికి పెంచ తలచుకోనట్లుంది. కారణం ఏమైనా కానీ ఆ పల్లెల్లో ఆశ్రిత వర్గానికి మాత్రం ఆపద్బాంధవుడై వెలిగిపోతున్నాడు.

ఏండ్లు పూండ్లుగా దేనిదారి దానిదిగా విడిపోయిన పల్లెలు ఇంతకాలానికి ఏకమై నడివీధి గంగమ్మ జాతర చేస్తున్నారంటే? ఆ జాతర్లో కొండారెడ్డి మామ పాత్ర ఏమిటో తెలుసుకోవడానికి మనసు తహ తహ లాడింది.

అంటే -- మా ఊరికి వెళ్లాలి!

వెళ్లాలంటే? ఈ జీవుడికి సవాలక్ష సందేహాలు. సమస్యలు. మొదటిసమస్య మా ఆఫీసులో అధికార రోగపీడితుడి అనుమతి. ఎలాగో బతిమాలి ఆ అనుమతిని కూడా సాధిస్తే చేతికి రూకలు? ఈ రెండూ సమకూడితే సమకూడని అసలు సమస్య ఒకటుంది. అది హోమ్ గవర్నమెంట్ పర్మిషన్. ఈ రోజుల్లో మందును, మగువల్ని, నోట్లకట్టల్ని అడ్డంగా పెట్టుకొంటే ఏ పర్మిట్ అయినా సరే! ఏ పర్మిషన్ అయినా సరే! అమ్మాయిలు సైకిలు తొక్కుతున్నంత సులువుగా కొట్టేయచ్చునని సామాన్యుల సర్వేలో తేలిందట. కానీ హోమ్ గవర్నమెంటుండాదే? ఎందుకులే? కడుపు చించుకుంటే కాళ్ల దగ్గరే పడుతుంది. అందుకే-

"నీతలపాడు నువ్వు పడు. నువ్వు వస్తే రా! లేకపోతే ఇంట్లోనే ఉండు!" అని హోమ్ డిపార్టుమెంటుకుఅల్టిమేటం జారీచేసి వాళ్ల చీదరింపుల్ని బెదిరింపుల్ని కట్టగట్టి చంకలో పెట్టుకొని జాతర ఇంకా రెండు మూడు రోజులు ఉందనగానే మాఊరికి బయలుదేరాను- ఊళ్లో జాతరని ఇంట్లో ఇంకొక జాతర జరిపించడం ఇష్టంలేక.

రెండు బస్సులెక్కి నాలుగు కిలోమీటర్లు నడిచి ఇంటికి చేరేసరికి మా అయ్య ఆనందానికి పట్టపగ్గాలేవు. పిల్లల కోడి కోడాల్ని వెంటబెట్టుకుని రాలేదని మా అమ్మ కాసేపు

చిర్రుబుర్రు లాడింది. అది మా అయ్య ఆనందంతో బీడి ముక్క కాల్చినంత సేపు కూడా కొనసాగలేదు. అంతలోనే అందరితో పాటు ఆమె కూడా జాతర హడావిడిలో పడిపోయింది.

నిజంగా మా ఆవిడగారే విచ్చేసి ఉంటే-ఆ ఇంట్లో నా బతుకు మద్దెలే అయ్యేది. తప్పిపోయింది. 'బ్రతుకు జీవుడా!" అని హాయిగా ఊపిరి పీల్చుకొన్నాను.

జాతర కింక రెండు రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఊరు మంచి జోరుమీద ఉంది. ఇల్లిల్లూ కొత్త కొత్త కాంతుల్ని సమకూర్చుకొంటూ ఉంది. ఎవరిమొగంలో చూసినా ఏదో చెప్పలేని ఆనందం. ప్రతి వ్యక్తీ నిలిచిన చోట నిలబడకుండా హడావిడిగా అటు ఇటు తిరుగుతున్నాడు. ఆ సంబరాల్ని పాలుపంచుకోవడానికి నేను మునాస పడుతుంటే - 'ఏమిరా అబ్బోడా! రానే వచ్చినావు. మీ కొండారెడ్డి మామను చూసిరాలేదంట్రా?' అని మా అయ్య అడిగాడు. అవును కదా మరి? మామ లీలల్ని చూడాలని వచ్చిన నేను మామనే చూడకపోతే ఎలా? అని కొండారెడ్డి మామను కలుసుకుందామని వెళ్లాను. కనిపించగానే- 'ఏమిరా అల్లుడూ! ఎప్పుడు రావడం? పిల్లా జెల్లా అంతా బాగుండారు కదా?' అని ఎంతో ఆప్యాయంగా పలకరించాడు. మా ఆవిడ పిల్లలు రాని దానికి కారణం అడిగాడు. బదులు చెప్పలేక నేను నీళ్లు నములుతుంటే-పక పక నవ్వుతూ 'మా బిడ్డ టౌను మణిసి కదరా? ఆ బిడ్డ కట్టుకొనింది నీ ఉద్యోగాన్ని కానీ నిన్నా?' అని నవ్వుతున్నాడు.

ఆ నవ్వు వెనుక ఏముందో? కోడి గుడ్డుకు చుట్టూ నలుపు తెలుపు కలగలిసిన వెంట్రుకల్ని అతికించినట్లున్న నునుపు తేలిన ఆ పుర్రెలో ఏ పురుగు తొలుస్తూ ఉందో? అతడు నోరువిప్పి చెప్పడు. గ్రహించడమూ అంత తేలికైన పని కాదు.

ఆ స్థితిలో నేను నవ్వుతున్న మామవైపు గుడ్లప్పగించి చూస్తుంటే చిత్రమైన అదే నవ్వును పొడిగిస్తూ "జాతర చూసే దానిక్కదా నువ్వొచ్చింది. చూడు మరి?" అన్నాడు.

"అందుకే కదా మామా రాక రాక వచ్చింది. చూడకుండా ఎట్లాపోతాను?"అన్నట్లుగా మామను నిశితంగా ఒక్కచూపు చూసి అప్పటికి సెలవు తీసుకొన్నాను. మామ బీడీ ముట్టించుకొంటూ ఉంటే!

ఎప్పుడు మేలుకొనిందో ఏమో కాలం? అలుపూ సొలుపు లేకుండా సాగిపోతూనే ఉంది. ఎడతెరపి లేని ప్రయాణం ఎంత కాలం గడిచిపోయిందో? రెండు దినాలు గడవడం ఎంతసేపు?

ఆ రోజే ఊళ్లో జాతర!

నడివీధిలో రచ్చబండ. ఆ రచ్చబండ ముందర పెద్దపందిరి వేశారు. మడివేలు మునెయ్య ఆ ఇంట్లో ఈ ఇంట్లో ఎరవలిగా తెచ్చిన వెన్నపట్టు చీరల్ని ఉతికి ఆరవేసి పందిరికి మూడు పక్కల తెరలుగా దించాడు. గంగమ్మ గుడి తయారయింది. ఆ గుడి ముందర అంటే పందిరి ముందరవైపు గుంజలకు గెలల మీదున్న రెండు అరటిమాకుల్ని కట్టారు. గుడి చుట్టూ వేపమండల్ని వేలాడ దీశారు. బంతులు చేమంతుల పూలసరాలతో

అలంకరించారు.

చూడముచ్చటగా తయారయింది గంగమ్మ గుడి. గుడిలో కుమ్మర బుడ్డయ్య కాలికొద్దీ తొక్కిన బంకమట్టితో 'నడీది గంగ'ను తీర్చి దిద్దాడు.

ఒక చేతిలో కత్తి...ఇంకొక చేతిలో త్రిశూలం...రంగురంగుల కిరీటం కండ్లు చింత నిప్పుల్లా మండుతున్నాయి. నాలుక బయటికి సాచి అంగుళం మందం కుంకం పూతతో నెత్తుటిలో ముంచి తేల్చినట్లుంది. చేతులకు నల్లగాజులు...మెడలో రంగు రంగు పూసలు...చెవులకు సిబ్బిరేకంత కమ్మలు. నడీది గంగను పిల్లలు చూస్తే జడుసుకుంటారు.

కుమ్మర బుడ్డయ్య మాత్రం గుడి ముందర నిలబడి గంగమ్మవైపు ఎగాదిగా చూసి తృప్తిగా గాలి పీల్చుకున్నాడు తన పనితనానికి తానే మురిసిపోతూ!

ఈ లోపుగా యింటికొక్క మనిషి చేరారు. ఊరంతా రంగు రంగు కాగితాల తోరణాల్తో...వేపమండల్తో సింగారించారు.

అలంకరణలో ఆ చుట్టుపక్కల పల్లెలన్నీ కూడా ఒకదానితో ఒకటి పోటీపడ్డాయి.

మా ఊళ్లో జాతర ఎప్పుడో నేను నిక్కరు తొడుక్కునే రోజుల్లో జరిగినా ఎవ్వరూ ఏదీ మరిచిపోయినట్టు లేదు. ఏదో గ్రంథస్తమైన బృహత్కార్యక్రమాన్ని తు.చ.తప్పకుండా నిర్వహిస్తున్నట్లుంది.

అయితే అప్పటికి ఇప్పటికీ ఒక్కటే తేడా!

అప్పుడు హరిజనుల దారీ తెన్ను హరిజనులదిగా, అరుంధతీయుల మాటా మంతీ అరుంధతీయులదిగా ఉండేది. ఒకరి గాలి ఇంకొకరికి సోకితే మండిపడేవాళ్లు. ఊళ్లో జాతర జరిగినా వాళ్ల డప్పులు వేరు. వీళ్ల డప్పులు వేరు. వాళ్ల కొమ్ములు వేరు. వీళ్ల కొమ్ములు వేరు. కానీ ఇప్పుడు మాత్రం ఇరుపక్షాలు కలగలిసి డప్పులు తప్పెట్లు వాయిస్తున్నారు. కొమ్ములు ఊదుతున్నారు. అంతా ఒకటై పోయినట్లు ఆనందలహరిలో జాతర చేసుకొంటున్నారు.

హరిజనుల అరుంధతీయుల కలయిక! నేను చూస్తున్నది కలా? నిజమా? అన్న సందేహం నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తింది. గాంధీ మహాత్ముడు గొంతెత్తి అరిచి అరిచి జనుల్ని హరిజనుల్ని ఒక్కటిగా చేయగలిగినాడు కానీ, ఈ ఇరు వర్గాలు మాత్రం ఉప్పూ నిప్పుగానే మిగిలిపోయారు. ఒకరి మాట ఒకరికి పడదు. ఒకరి ఇంటిమీద కాకి ఇంకొక ఇంటిమీద వాలకూడదు. అలాంటిదీ పూట...

ఉన్నట్లుండి పాకిస్తాన్, ఇండియా అణుబాంబుల తయారీలో ఒక ఒడంబడిక కుదుర్చుకొని ఆ మేరకు రాతకోతలు జరుపుకొన్నారని విన్నా...ఒక కుక్క పంది పిల్లకు పాలిచ్చిందని విన్నా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. కానీ మా పాయకట్టులో హరిజనులు, అరుంధతీయులు ఒక్కటైపోయారంటే...?

కొండారెడ్డి మామ కారణం కాదు కదా అని ఆలోచిస్తున్నాను.

పొద్దు గూట్లో పడింది.

అప్పుడు నడివీధి గంగమ్మ ఊరు మెరవణికి బయలుదేరింది.

తేరులా సింగారించిన రెండెద్దుల బండి మీద ఊరేగింపుగా బయలుదేరిన గంగమ్మ ఇంటింటి ముందర ఆగుతూ ఉన్నవాడు పొట్టేల్ని బలిస్తే నింపాదిగా నిలబడి స్వీకరించింది. కోడిపిల్లను బలిచ్చే చోట కొంచెం తొందర తొందరగా ముందుకు సాగింది. కేవలం టెంకాయ ముడుపు అయితే పోతూ పోతూనే స్వీకరించింది.

ఊరేగింపు ఇంటింటి ముందర ఆగుతూ ఆగుతూ ఎంతో ఉత్సాహంగా ముందుకు సాగిపోతున్నా నేను మాత్రం కొండారెడ్డి మామను ఒక కంట గమనిస్తూనే ఉన్నాను. అందరితో కలిసి ఆయన నడుస్తున్నాడే కానీ ఏ ప్రత్యేకతా కనిపించలేదు.

మా ఊళ్లో ఇంటికొక్క బలితో సంతృప్తి చెందని గంగమ్మ తల్లి ఇంకొక్క ఊళ్లో అడుగుపెట్టింది. ఇల్లిల్లు తిరిగింది. ఇంటికొక్క బలిని స్వీకరించింది. తరువాత ఇంకొక్క ఊరు. ఆ తరువాత మరొక ఊరుగా ఏడూళ్లు తిరిగింది. ఊరూరా ఇంటికొక్క బలిని విధిగా స్వీకరించింది.

అప్పటికి రాత్రి మూడు జాములు గడిచింది.

అంతవరకు అలుపు సొలుపు ఎరక్కుండా డప్పులు, తప్పెట్లు మోగుతున్నాయ్. కొమ్ములు ఫీంకరిస్తున్నాయ్. కోలాటం కొనసాగుతూనే ఉంది. పంబలు పలుకుతూనే ఉన్నాయ్. బాణాసంచాలు పేలుతూనే ఉన్నాయ్. ఏడూళ్ల ఏకమైన కారణంగా జాతర కోలాహలం ముమ్మరంగా ఉంది.

మెరవణి తిరిగిన గంగమ్మ తిరిగి వచ్చి నడివీధి గుడిలో కొలువు తీరింది. అప్పుడు ఇంటింటి నుండి ఆతల్లికి కుంభం బయలుదేరింది.

ఆ పూట మాత్రం కాగుల్లోనో, కడవల్లోనో తలదాచుకొన్న పళ్లాల్లో కంతటికి పెద్ద పళ్ళెం బయటికొచ్చింది. చింతపండు గుజ్జుతో చేతులరిగేటట్టు ఆ పళ్లెం తళ తళా మెరిసేలా తోమారు. ఆ పళ్లెం నిండుకు కూడు కుప్పగా పోశారు. ఆ కూటి కుప్పమీద సలిబిండితో చేసిన ప్రమిదను పెట్టారు. ఆ ప్రమిద నిండుకు నూనె పోశారు. గాలి తాకిడికి తట్టుకొని నిలబడాలని చిటికిన లావంత వత్తిని వేశారు. ఆ వత్తి బాగా నూనెలో తడిసి ముద్దయిన కొనను కొనవేళ్లతో నలిపి ముట్టించారు. ఆ కూటి కుప్ప చుట్టూ అపూట ఇంట్లో వండిన వంటకాలన్నీ అమర్చినట్లు పెట్టారు. ఏ యింటి పళ్లెం ఆయింటి హోదాను చాటుతుంది కాబట్టి ఎంగిలి చేత్తో కాకిని విదిలించని దాన కర్ణులు గూడా ఆ రోజు చాలా ఉదారంగా వ్యవహరించారు.

ఇంటికొక్క ముత్తైదు. ముత్తైదు చేతికొక్క కుంభం కూటి పళ్లెం. పళ్లెం పళ్లాని కొక దీపం. అమావాస్య ముందు ముందు రోజు చీకట్లను చీలుస్తూ చిరుదివ్వెలు...ఆ దివ్వెల వెలుగులకే వెలుగులినస్తూ అమాయకంగా వెలిగే కొన్ని కండ్లు...పోటీలు పడ్తూ కోటేరేసినట్లున్న కొన్ని ముక్కులు...నును సిగ్గు దొంతరల చెక్కిళ్లు...అల్లంత దూరాన

నిలబడి గమనిస్తూంటే చీకటి లాంటి నీళ్లపై తేలిపోతున్న తెప్పపై వెలుగుతున్న దివ్వెలు... ఆ దృశ్యం కనుల పండువుగా ఉంది.

కుంభం కూడు గుడి దగ్గరికి వచ్చేసరికి మడివేలు మునెయ్య గుడి ముందర మూరడెత్తు వరికసువు పరుపు మాదిర సర్దాడు. తడిపి పిండిన తెల్లటి దుప్పటిని దానిమీద పరిచాడు. ముత్తైదులందరు గంగమ్మ గుడిచుట్టూ మూడు చుట్లు చుట్టారు. గంగాళం తట్టలోని దివ్వెల్ని మాత్రం తీసి పక్కన పెట్టి కుంభం కూటిని మాత్రం దుప్పటిమీద కుమ్మరించారు.

కుంభం కూడు గంగమ్మ గుడి ముందర ఒక సుమారుపాటి గుట్ట మాదిర పడింది. ఇంటికొక్క కూడు. ఇంటికొక్క కూర. కలగలిసిన ఆ కూటి దిబ్బను చూస్తుంటే తెల్లటి గుట్టమీద చెట్టూ చేమా మొలిచినట్లుంది.

మడివేలు మునెయ్య నోటికడ్డంగా గుడ్డ కట్టుకొన్నాడు, పొరబాటుగా అయినా ఎంగిలి తుంపర ఎగిరి పడ్తుందేమో అన్న భయంతో. ఊరేగింపులో అలిసి సొలిసినట్లున్న అమ్మవారి అలంకరణలన్నీ సరి చేస్తున్నాడు. భక్తి భావంతో క్షణక్షణానికి మనిషి తడిసిన గువ్వలా ముడుచుకు పోతున్నాడు. కుమ్మర బుడ్డయ్య సలిబిండి ప్రమిదలన్నింటిని ఒక్కటిగా చేర్చి మట్టిని పిసికినట్లు పిసికాడు- గండదీపం చెయ్యడానికి!

ఎంచినట్లు నూటొక్క బిందెల నీళ్లు నెత్తిన పోసి కడిగిన దున్నపోతు- నున్నగా మిసమిస లాడుతూ ఉంది. దాని ముఖాన ముచ్చటగా పసుపు పూసి, కుంకుమ బొట్టుపెట్టారు. మెడను పూలదండతో అలంకరించారు. ఒక కొమ్ముకు ఎర్రమట్టి రంగు...ఇంకొక కొమ్ముకు సున్నం రంగు పూశారు. రచ్చబండకు కొంత దూరాన గుంజకు కట్టేస్తే ఇంకాసేపట్లో తన గతి ఏమవుతుందో తెలియకుండా అరమోడ్పు కన్నుల్తో జాతర్ని తిలకిస్తున్నదా అన్నట్లు నిలబడింది.

డప్పులు...తప్పెట్లు...పంబలు...కొమ్ములు...కోలాటం...మంచి కోపుమీద ఉన్నాయి.

తూర్పున పటం ఎగురుతున్నది.

అంతలో ఉన్నట్లుండి డప్పుల కొమ్ముల మోత ఆగిపోయింది. ఆ స్థానంలో గలాటా లేచింది. ఎందుకో, ఏమిటో అని ఆలోచిస్తూనే ఆదరాబాదరా అటువైపుగా పరుగెత్తాను. కొండారెడ్డి మామ అక్కడి నుండి చల్లగా జారుకొని గుంపులో కలిసిపోవడం కంట పడింది.

అంతవరకు ఎంతో ఆనందంగా మైమరచినట్లు డప్పులు, తప్పెట్లు వాయిస్తూ కొమ్ములూదుతుండిన హరిజనులు, అరుంధతీయులు అటొకరు, ఇటొకరుగా వేరుపడి వాదులాడుకొంటున్నారు.

"ఒరే వోరే! ఉన్నట్టుండి మీకేం దూము తగిలి పొయ్యే కాలమొచ్చింది? మమ్మల్ని తాకద్దన్నట్టుగా ఆడపొయ్ నిలబడుకుణ్ణారే?" హరిజనులు అడుగుతున్నారు.

"ఏమయితే మీకేం? మీపని మీర్జేసుకోండి. మా పని మేం జేసుకుంటాం!"

కుండ పగలగొట్టినట్లుగా బదులు చెప్తున్నారు అరుంధతీయులు.

"ఇదేం పొయ్యేకాలంరా మీకు?"

"ఇద్దో ముందుగానే చెప్తా ఉండాం. పొయ్యేకాలం గియ్యేకాలమనినోరు పారేసుకో బాకండి. యవ్వారం చెడ్తే అదెవుడికీ మంచిది గాదు."

"ఒరే వొరే! మీరు గమ్మునుండండ్రా ఈ పొద్దేమో శానా మొగోళ్లయి పొయ్‌నట్టు మాట్లాడ్తా ఉండారీళ్లు. పాపమని పాత కోకిస్తే ఇంటెనక్కు పొయ్ మూరేసుకుణ్ణెట్టుంది యవ్వారం. పోతే పోనీలే! అని కలేసుకుంటే ఏమో నిగిడి నిగిడి పడ్తా ఉండారే బిడ్డలు? అదేడికి పోతిందిలే మాదిగబుద్ది? పొమ్మంటే పొయ్యేటట్టుగా ఉంటే అదా బుద్దెట్లవితిందిలే?"

వారించినట్టే వత్తిని ఎగదోస్తున్నారు వయసు మళ్లిన హరిజన పెద్దలు!

"మావి మాదిగ బుద్దులైతే మీవి? అంతకన్నా యీనమైన మాల బుద్దులు కావో? అనేదెందుకు? అనిపించుకుండేదెందుకు?"

"ఏమన్నార్రా?" అని హరిజనులు పైపైకి ఎగబడుతూంటే "మీరనేదేందిరా?" అని అరుంధతీయులు గోచీ లెగజెక్కుతున్నారు. అందులో నాటు సారా తాగిన మత్తు. వాళ్ల వొళ్లు వాళ్లకు తెలియడమే లేదు. కత్తి గట్టిన కోడిపుంజులే అయ్యారు.

ఈ కీచులాటలో డప్పులు, తప్పెట్లు సేద తీర్చుకొంటున్నాయి.

"ఎన్న పడేటప్పుడు బాన పగిలిపట్లుంది కదరా యవ్వారం? గంగమ్మకు జాతర జరగతా ఉంటే-మీ జాతర మీదైతే ఇంక మేము యాడబొయ్ సావాల్రా? అయినా ఇప్పుడున్నెట్టుండి ఎందుకొచ్చిందిరా ఈ కీచులాట?"

జనులు అడుగుతున్న మాటలు హరిజనుల చెవుల్లో పడటం లేదు.

"మీకు పుణ్ణెముంటుంది. ఒరే ఒరే! మల్లా కావాలంటే మద్దిస్తం పెట్టకుందాం. ముందుగా తల్లికి పూజలు జరగనీయండ్రా!"

జనులు అడుక్కొనేకుందికీ హరిజనులు ముడుక్కొంటున్నారు.

సర్ది చెప్పే కుందికి మరీ రెచ్చిపోతున్నారు.

అప్పుడు రంగంలోకి దిగాడు కొండారెడ్డి మామ!

కొండారెడ్డి మామ చేతిలో కొరడా లేదు. ముఖంలో రవ్వంత కోపంలేదు. అయినా ఆయన కంట పడేసరికి అందరి నోళ్లకు తాళాలు పడినట్లు సద్దు మణిగింది.

కొండారెడ్డి మామ ఒక్క నిముషం సేపు నిబ్బరంగా నిలబడుకొన్నాడు. ఇరు వర్గాల్ని మార్చి మార్చి ఎగాదిగా చూశాడు. ఆ తరువాత గంగమ్మ వైపు చూస్తూ నిశ్చలంగా నిలబడుకొన్నాడు.

ఇప్పుడు అందరు కలిసి ఆయనవైపే చూస్తున్నారు.

"ఆ తల్లి సాక్షిగా చెప్తా ఉండాను. పలకతా ఉండేది నేను గాదు. ఆ తల్లే పలికిస్తా ఉండాది. మీరు మీరు కలిసి పొయ్యింది ఆ తల్లికి గిట్టనట్లుంది"

అందరు గంగమ్మ తల్లే వాళ్లకు చెప్తున్నంత శ్రద్ధగా వింటున్నారు.

"లేకపోతే ఇంత సేపు ఎంతో వొద్దిగ్గా ఆనందంగా ఆడ్తా పాడ్తా ఉండి ఇప్పుడిట్లా కీచులాడుకుంటా ఉండారంటే- ఆ తల్లి నిజంగానే కన్నెర్రజేసింది.!"

"నిజమే సామీ! నిజమే ....అచ్చిరాలా నిజమే!"

ఇరుపక్షాలు ఒకరినొకరు చూసుకొంటూనే కొండారెడ్డి మామ అభిప్రాయాన్ని అంగీకరించారు.

"అంతే కదా మరి? ఇంక తకరారెందుకు? వాళ్ల పని వాళ్లది. మీ పని మీది. ఇంక జరగాల్సిన పన్లు కానీయండి మరి?"

కొండారెడ్డి మామ తీర్పుతో ఆగినట్లుగా ఆగిన జాతర మళ్లీ ఆరంభమయింది. డప్పులు...కొమ్ములు...తప్పెట్లు రెండుగా వేరు పడ్డాయి. అయితే కొత్త కొత్త దరువుల మీద పోటీలు పడ్తున్నాయ్. తొండాలు పైకెత్తిన ఏనుగుల్లా కొమ్ములు ఘీంకరిస్తున్నాయ్!

ఈ పోటీతో జాతర కొత్త ఊపు పుంజుకొనింది.

"జరగాల్సిన పన్లు తొందరగా కానీయండ్రా మరి?...తెల్లారిపోతా ఉండాది!" అని కొండారెడ్డి మామ మళ్లీ హెచ్చరించాడు.

ఇక జరగాల్సిన పని ఒక్కటే!

అది దున్నపోతును బలివ్వడం.

శివమెక్కినట్లుగా ఆడతూ పాడుతూ హరిజనులు ఒక్కసారిగా దున్నపోతు మీద పడ్డారు. చావు తెలివి వచ్చినట్లుగా అది మొండికేసింది. అడుగు ముందుకు వెయ్యనంటూ మొరాయిస్తూ ఉంది. అయినా వాళ్లు వదిలిపెట్టలేదు. కొందరు పగ్గాన్ని మరి కొందరు దాని తోకను...కొంతమంది దాని కొమ్ముల్ని ఏది దొరికితే దాన్ని లగుసుకొన్నారు. గంగమ్మ ముందరి కీడ్చుకొని వచ్చారు. అక్కడ అంతకు ముందే మొలలోతు గుంతను తవ్వి పాతిన బలికంబం. ఆ బలి కంబానికి దాని తలను ఆనించారు.

అలా ఆనించిన దాని తలను బలికంబానికి నిగ్గదీసి కట్టాల్సింది అరుంధతీయుల పని!

బలి అయిన తరువాత బలి కంబానికి వేలాడుతున్న దున్నపోతు తలను విప్పడం హరిజనుల పని!!

పీటల మీద పెండ్లి కొడుకు పెండ్లి కూతుళ్లను అరివేను కుండలో కమ్మ కడియం ఆట ఆడించినట్లు ఇరు వర్గాల మధ్య ఇదొక చిత్రమైన పోటీ!.

అరుంధతీయులు వేసిన ముళ్లను విప్పి బలి కంబానికి వేలాడుతున్న దున్నపోతు తలను తీసి హరిజనులు గంగమ్మ ముందర పెట్టేలోపుగా అరుంధతీయులు దున్నపోతు ముందరి కాళ్లలో ఒక కాలిని కోసి ఆ కాలిని దాని నోటిలో అడ్డంగా పెట్టాలి. ఇందులో ఏ మాత్రం ఆలస్యం జరిగినా దున్నపోతు నోరు బిగుసుకు పోతుంది. బిగుసుకున్న నోట్లో కాలు పెట్టడం వీలుకాని పని.

అలా పెట్టలేక పోతే అది గ్రామాలకు అరిష్టమట!

అరుంధతీయులు వేసిన ముళ్లను విప్పడం హరిజనులకొక సవాలైతే, హరిజనులు ఆ ముళ్లను విప్పి దున్నపోతు తలను గంగమ్మ ముందర పెట్టేలోపుగా దాని ముందరి కాళ్ని తెగనరికి నోట్లో పెట్టడం అరుంధతీయుల కొక ఎదురు సవాల్!

అరుంధతీయులు దున్నపోతు తలను బలి కంబానికి వేసి నిగ్గదీసి కట్టారు. చిక్కు ముళ్లు వేశారు. ఆ ముళ్లు బిగుసుకోవడానికి బిందెల్తో నీళ్లు పోశారు.

అప్పుడు హరిజనుల్లో ఒకడు పసుపు పూసి కుంకం బెట్టిన పట్టా కత్తిని చేతికందు కొన్నాడు. రెండు చేతుల్తో పట్టుకొని కండ్లకద్దుకున్నాడు. ఆ తరువాత భయభక్తిగా వంగి ఆ కత్తిని గంగమ్మ ముందు పెట్టాడు. మూడుసార్లు సాష్టాంగ పడి నమస్కారాలు చేశాడు. ఆ తరువాత కత్తిని చేతికందుకొన్నాడు.

అప్పుడు చూడాలి వాడి ఆవేశాన్ని!...ఒళ్లంతా అదురుతూ ఉంది. శరీరంలోని శక్తి అంతా చేతుల్లోకి చేరుకొన్నట్లు ముంజేతి నరాలు ఉబికాయి. కండ్లు చింతనిప్పుల్ని కురిపిస్తున్నాయి. కత్తిని రెండు చేతుల్తో పట్టుకోని 'కిలోలోలో!' అని కిలారిస్తూ కత్తిని పైకెత్తాడు. దిక్కులు దద్దరిల్లేటట్లు...వాడి ఆవేశం అవిర్లు కక్కేటట్లు అందరూ 'కిలోలోలో!' అని వాడితో గొంతు కలిపారు ఒక్కసారిగా ఆ రంపుతో వాడి ఆవేశం తారాస్థాయినందుకొనింది.

పైకి లేచిన కత్తి ఆ ఊపుతో దున్నపోతు మెడ మీద పడింది.

పడిన కత్తి పైకి లేచింది. మళ్లీ పడింది! మళ్లీ పడింది!

దున్నపోతు తలా మొండెము రెండూ రెండయ్యాయి!

చిమ్మన గోవితో చిమ్మినట్టు గంగమ్మ గుడి ముందర రక్తం మడుగు కట్టింది.

దున్నపోతు తల మాత్రం బలి కంబానికే వేలాడుతూ ఉంది.

ఆ తలను విప్పి హరిజనులు గంగమ్మ ముందు పెట్టాలి. హరిజనులందరు కలిసికట్టుగా ఆ తలచుట్టూ మూగినారు కాకుల్లా.

కడవలో ఉన్న కమ్మను కడియాన్ని తీసుకోవడానికి పెండ్లికొడుకు, పెండ్లికూతురు చిత్రమైన పోటీ పడ్తారు. ఆ పోటీలో ద్వేషం లేదు. వీళ్లూ అంతే! ఒకర్నొకరు అధిగమించాలన్న ఉత్సాహం ఉరకలు వేస్తుంటుందే తప్ప ద్వేషానికి ఆస్కారముండదు.

కానీ ఆరోజు వాళ్లలోవాళ్లకు విభేదించిన కారణంగా దున్నపోతును బలిచ్చే తంతులో ద్వేషం చోటు చేసుకొనింది.

బలి కంబానికి వేలాడుతున్న దున్నపోతు తలను విప్పడానికి హరిజనులు సతమతమవుతున్నారు. తడిసి బిగుసుకుపోయిన ముళ్లు చిక్కు వీడడమే కష్టమైంది. ఒక్క ముడి చిక్కు తీస్తే ఇంకొక ముడి చిక్కు పడింది. దున్నపోతు తల చుట్టూ చేరి హరిజనులు తల కొక్క తీరుగా వాదులాడుతూ తలావొక చెయ్యేసి తనకలాడి పోతున్నారు.

అది చూసి అరుంధతీయుల్లో హుషారు హెచ్చింది.

నిముషాల్లో దున్నపోతు కాలిని తెగకోశారు. తెగకోసిన కాలిని ఒకడు చేత్తో పైకెత్తి పట్టుకొంటే - అందరూ చేరి వాణ్ణి పైకెత్తి పట్టుకొన్నారు. విజయోత్సాహం వాళ్ల ముఖాల్లో తాండవించింది. కొందరు మీసాలు తిప్పారు. కొందరు ఈలలు వేస్తున్నారు. మరి కొంతమంది ఆడుతూ పాడుతున్నారు.

హరిజనుల్లో పట్టుదల ఇనుమడించింది. ఎట్టెట్లో పెరుకులాడి పీకులాడి దున్నపోతు తలను విప్పుకొన్నారు. ఆదరా బాదరా గంగమ్మ ముందర పెట్టారు.

అయితే ఏం ప్రయోజనం? దాని నోరు బిగుసుకపోయింది. తలకొట్టేసినంత పని కాగా హరిజనులు తలలు వాల్చేశారు.

"గంగమ్మ తల్లి సాచ్చిగా వాళ్లేమో వోడి పొయ్‌నారు. మేమేమో గెల్చినాం. కుంబం కూడు ముందుగా మాకెయ్యాల్సిందే!"

అరుంధతీయులు పట్టుబట్టారు.

"ఇదేంది? కుశాల కాడుకునే ఆట. దీన్లో గేల్చేదేంది? ఓడేదేంది? కుంబం కూడు మొదట్లో మాకేసేది తాతముత్తాతల కాలం నుంచి మాకొస్తా ఉండే మిరాశి. మిరాశిని కాదని కుంబం కూడు మీకేసే దెవురో? మేం చూడకుండా బోతామా?"

హరిజనులు ఏకంగా సవాలు చేశారు.

"పోనీ! ఇది కుశాల కాడుకునే ఆటే అనుకుందాం. ఆ ఆటిట్లా మార్చుకుంటే పోలా! ఇంతకాలం ముందుగా మీరు తీసుకుంటా వుంట్రి కదా? ఇప్పుడు మేం తీసుకుంటాం!"

"అదెట్లా కుదుర్తింది? అప్పుడు మిరాశేం కావల్ల?"

"మిరాశి పెట్టిందెవుడు? ఎప్పుడో మన పెద్దోళ్లు పెట్టుకున్నారు. ఇప్పుడు మన మిట్లా పెట్టుకుంటే ఇంకొక్కాలానికిదే మిరాశిగా మార్తింది. ఏది ఏమైనా కానీ కుంబం కూడు మొదట మాకెయ్యాల్సిందే"

"అదెట్టా యాస్తారో మేమూ చూస్తాం!"

"ఎందుకెయ్యరో మేమూ చూస్తాం!"

"ఏందిరా మీర్జూసేది?" అని హరిజనులు ఒక్క అడుగు ముందుకు వేసేసరికి "మీరేందిరా జూసేది?" అని అరుంధతీయులు రెండడుగులు ముందుకేశారు.

ఉత్సాహంగా ప్రారంభమైన జాతర్లో ఉద్రేకం చోటుచేసుకొనింది.

మాటకు మాటగా పెరుగుతూ వుండగానే 'ఫట్' మన్న శబ్దం చెవిని పడింది. చూద్దును గదా? ఒకడి తొందరపాటుతో ఇంకొకడి తల పగిలింది.

వీళ్ల చేతుల్లో కత్తులున్నాయ్! వాళ్ల చేతుల్లో కొమ్ములున్నాయ్!

ఒకడి తల పగిలి రక్తం కంట పడేసరికి ఇరుపక్షాల్లో ఆవేశం కట్టలు తెంచుకొనింది. కత్తులు కత్తులు వేట్లాడుతున్నాయ్. కొమ్ములు కొమ్ములు పోట్లాడుతున్నాయ్. తలలు పగులుతున్నాయ్. చేతులు తెగుతున్నాయ్. కాళ్లు విరుగుతున్నాయ్. రక్తం ఎగచిమ్ముతూ

ఉంది.

గంగమ్మ గుడి ముందర కళ్లాపు చల్లినట్లున్న రక్తం ఎర్రపడపోతున్న తూర్పు దిక్కుకు స్వాగతం పలుకుతున్నట్లుంది.

జాతర వేడుకల్ని చూడడానికని వచ్చిన పిల్లా జల్లా ఆ ఘోరాన్నిచూడలేక ఉచ్చులు తెంపుకొన్నట్లుగా దిక్కు కొకరుగా పరుగెత్తుతున్నారు. ఆడవాళ్లు అంతకు ముందెప్పుడో కాళ్లకు బుద్ధి చెప్పి కొంపల్లో దూరి తలుపులు బిగించుకొన్నారు.

కలబడిన వాళ్ల మధ్య జొరబడి విడదీయలేని పరిస్థితిలో ఊళ్లో పెద్దలు గుటకలు మింగుతున్నారు.

హరిజనుల్లో కొందరు నెత్తురు ముద్దలై నేలకొరిగారు. అరుంధతీయుల్లో అంతకు రెండింతలుగా కూలబడ్డారు. అప్పటికీ తెలివి వచ్చి మేలుకున్నట్లుగా నేలకూలిన వాళ్లను చేతులమీదుగా జవురుకొని అరుంధతివాడ వైపు అరుంధతీయులు, హరిజనవాడ వైపు హరిజనులు పరుగులు తీశారు.

"ఊళ్లకు పట్టిన అరిష్టం వదలబొయ్యేటట్టుగా లేదు. లేకుంటే లేక లేక తలపెట్తే గంగమ్మ జాతరిట్లా ఆరూ మూడవితిందా? ఇదేందో యినాశకాలానిగ్గానే ఉండాది" అని గొణుక్కుంటూ ఊళ్లో వాళ్లు ఏం చేయాల్నో తోచకుండా అర్థం పర్థం లేకుండా అటు ఇటు తిరుగుతున్నారు.

కుక్కలు కుంభం కూడు తింటున్నాయి. మధ్య మధ్య నంజుకొన్నట్లుగా రక్తాన్ని నాకుతున్నాయి.

కాలు నోట్లో పెట్టలేదనేమో? దున్నపోతు మూతి ముడుచుకొని కండ్లు కూడా మూసుకొనింది.

గంగమ్మ తల్లి మాత్రం చిరునవ్వులు చిందిస్తూనే ఉంది.

కొండారెడ్డి మామ రచ్చబండ మీద కొలువు తీరి బీడీ కాలుస్తున్నాడు.

ఆడుతూ పాడుతూ ఎంతో ఆనందంగా కలిసి మెలిసి జాతర చేసుకొంటూ ఉండిన దళితుల్లో ఉన్నట్లుండి తలెత్తిన ద్వేషానికి కారణం అర్థం కాలేదు. మడుగులు కట్టిన రక్తాన్ని చూస్తుంటే కండ్లు తిరిగుతున్నాయి. అంత వరకు ఆ రక్తపు మడుగులో విలవిలలాడుతుండిన దున్నపోతు మొండెం ఎర్రబారిన ఆకాశంలో నిశ్చలంగా నిలబడిన కారు మేఘంలా కదలిక లుడిగి పడి ఉంది.

జాతర చూడాడానికని వచ్చి ఈ ఘోరాన్ని చూడవలసి వచ్చిందే? అని ఆలోచిస్తూ కొండారెడ్డి మామ దగ్గరికి వెళ్లాను.

కొండారెడ్డి మామ నన్ను చూసి పకపక నవ్వాడు.

నాకు అరికాల మంట ఉచ్చికెక్కింది.

"ఈ పరిస్థితుల్లో నువ్వు నవ్వుతున్నావే? నీకు మనసెట్లా వొప్పింది మామా?" అని

అడగాలనుకొన్నాను. అంతలోనే...

"నాయాండ్లు! ఎంతదా వాళ్లూ వాళ్లూ వొగిటైపోతే మాత్రం పిడికిడు కూడు పెట్టే రైతులేన్నే ఇట్లా ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిపిస్తారా?"

"నువ్వు చెప్పేది చాలా విచిత్రంగా ఉంది కద మామా? రైతులు వాళ్ల నేడిపిస్తా ఉండారా? వాళ్లు రైతులేన్నేడిపిస్తా ఉండారా?"

"రైతులు వాళ్ల నేడిపించే కాలమెప్పుడో చెల్లి పొయ్యిందిరా అల్లుడూ? యవ్వారం ఇప్పుడు కిందు మిందులయింది. వాళ్లే వీళ్లను ఏడిపిస్తా ఉండారు. అడుసు దున్నేదాని కొస్తే నారుపోసేదానికి రారు. నారుపోసే దానికొస్తే పైరునాట్నానికి రారు. పైరు నాట్నాని కొస్తే కలుపు దీసే దానికి రారు. కలుపు తీసేదానికొస్తే కోతకురారు. ఎట్రా ఈళ్లతో ఏగేది? ఆ రొంత్రూపాయల బియ్యం ఇస్తానన్నా యిసా ఉండారు కానీ రొంత్రోజులు కూలికొచ్చి నాలుగు రోజు లెగరోస్తే రైతేం కావాల్రా?"

"అది వాళ్ల ఇష్టం కద మామా! ఇష్టముంటే కూలి/చేసుకుంటారు. లేకుంటే వాళ్ల కొంపల్లో వాళ్లుంటారు. అడిగే దానికి మనకేం హక్కుంది?"

"నిజమే? మనకే హక్కు లేదు. అది వాళ్ల ఇష్టమే! అదే తనక్కావాల్సినంతే రైతు పండించుకంటే అది రైతు ఇష్టం. అప్పుడు టౌన్లల్లో కూసోని మీరంతా ఏం తింటార్రా? గెడ్డి తింటారా? ఆ గెడ్డిని కూడా రైతే పండించాల్నే. ఒరే అబ్బోడా! సేద్యం అంటే ఆఫీసుల్లో కూసోని తెల్లకాగితాల్ని నల్లంగా చేసేది కాదురా! గింజ గింజ కొక బొట్టు చెమట రాలిస్తే కానీ గింజలు చేతికందవురా! నువ్వు ఆఫీసులో కూసోని రాసే రాతల్ని టైపు కొట్టేదొకడు...ఆ కాగితాల్నెత్తుకోని పొయ్ఇచ్చేదొకడు....తెచ్చేదొకడు...పంపించే దింకొకడు- గాలికి లేసి పొయ్యే కాగితం కదిలే దాని కింతమంది - కొసురుకు పైనొక పంకా - కావాల్సి వస్తా ఉంటే ఈమట్టిలో నుంచి బువ్వ గింజల్ని వెలికి తియ్యాలంటే మాట్లా? రైతుకు చేదోడు వాదోడుగా ఉండాల్సిన నాయాండ్లు... ఒకే ఒక్క పూట ఆలూ మొగుడు కూలి కొస్తే...ఇరవై రూపాయలు చేతిలో పడ్తే... ఆ యిరవై రూపాయలకు పది కేజీల బియ్యం సంచిలో పడ్తే - ఈ నాయాండ్లు మండలాఫీసుల మింద పడ్తారు. ఆ అప్పు కావాల. ఈ అప్పు కావాలని. అప్పుల్ని చేతుల్లో పెట్టుకోని ప్రెబుత్వం...ఓట్లు చేతుల్లో పెట్టుకొని ఈ నాయాండ్లు ...ఒకరి చుట్టూ ఒకరు అల్లిబిల్లి తిరగతా ఉంటే - ఇంక దేశంలో ఉత్పత్తి ఎట్లా జరగాల? దేశం ఎట్లా ముందుకు పోవాల? ఒరే అబ్బోడా! మణిసి ఏమన్నా కావచ్చు కానీ బిచ్చగాడు మాత్రం కాకూడదురా. వీడెమ్మానాయాలి పనికిమాల్నె ప్రభుత్వాలు - ఏది చచ్చినా ఏది వచ్చినా బిచ్చగాళ్లుగా చేసి పారేస్తుండాయ్. ఇంక మనిషి నడుం వంచి పనెక్కడ చేస్తాడు? మీరు చదువుకొన్న ఇంగ్లీషులో చెప్పాలంటే ఇవన్నీ ఈటింగ్ ప్రెబుత్వాలే కదరా?"

అడుగు బడుగు వర్గాల్ని అరికాలి కింద తొక్కి పెట్టకోవడానికి కొండారెడ్డి మామ లాంటి మేధావులు తయారు చేసి ఉంచుకున్న పథకాలు పకడ్బందీగా ఉన్నాయి. మారు

మాట్లాడడానిక్కూడా వీలు లేనంత చిక్కగా చక్కగా అల్లి పెట్టుకొన్న పథకాన్ని ఎదిరించే శక్తి లేనట్లుగా -

"అది సరే మామా! ఇంతసేపు ఆడ్తా పాడ్తా ఉన్నవాళ్లు ఉన్నట్లుండి జుట్లు జుట్లు పట్టుకొన్నారే? చూస్తా చూస్తా ఉండగానే..."

కొండారెడ్డి మామ నవ్వుందుకొన్నాడు ఏదో ఘనకార్యం సాధించినట్లుగా!

"అడగతా ఉంటే నవ్వతావెందుకు మామా?"

"నవ్వకుండా ఏడవమంటావా? నాకేం కర్మరా ఏడ్చేదానికి?ఏడ్చే నాయాండ్లు ఏడస్తా ఉండారు!"

"అదేగద మామా నేనడిగేది! ఇంత అన్యాయం ఎలా జరిగిందని?"

"అన్యాయమా! హ్హా హ్హా హ్హా! అది మన యిష్టమా! అంతా ఆ గంగమ్మ తల్లి ఇష్టం. రక్తపాతం కావాలనుకొంది. జరిపించుకొనింది!"

"నేనడగాతా ఉండేది నిన్ను మామా? గంగమ్మను కాదు"

ఆ మాటతో ఒక్క క్షణం స్తబ్దుడయ్యాడు మామ. చురుగ్గా ఒక్క చూపు నా వైపు చూశాడు. మెల్లగా తల పంకించాడు. ఆ తరువాత ముసి ముసిగా నవ్వుతూ-

"ఒరే అబ్బోడా! ఒకనాడు కురుక్షేత్రంలో యుద్ధం జరిగింది. ఎట్లా జరిగిందంటే? జరిపించినోడు జరిపించినాడు. ఏ వుండాదిరా? యాడ ముట్టించాల్నో ఆడ ముట్టిస్తే యాడ పేలాల్నో ఆడ పేలిపొయ్యింది. పాడు సస్పెన్సులో పెట్టి నిన్ను చంపేదెందుక్కానీ హరిజనుల కొమ్ములెట్లుంటాయిరా?"

"ఇంగ్లీషులో ఎస్ అక్షరం మాదిరుంటాయి మామా?"

"అంటే-వాళ్ళూదుతుంటే ఎంగిలి ఎదుటోడి మింద పడ్తుంది. అవునా?"

"అవును!"

"అరుంధతీయుల కొమ్ములెట్లుంటాయిరా?"

"ఇంగ్లీషులో 'యు' అక్షరం మాదిర ఉంటాయి."

"అంటే - వాళ్లూత్తుంటే వాళ్ల ఎంగిలి వాళ్లమిందే పడ్తుంది. అవునా?"

"అవును"

"అంతే సంగతులు. వీళ్లూ వీళ్లూ కలిసి కొమ్ములూత్తా ఉండారా? మెల్లంగా పాయ్ అరుంధతీయుల పక్కన చేర్నానా? ఒరే మతిలేని నాయాండ్లాలా? మీరూదే కొమ్ముల్లో ఎంగిలి మీ మిందే పడ్తా ఉండాది. వాళ్లూదే కొమ్ముల్లో ఎంగిలీ మీమిందే పడ్తా ఉండాది. బతికినంత బతుకూ బతికి యిదేం బతుకురా? అన్నానా? అంతే! ఎవుర్దోవ వాళ్లదయింది. ఆ తరువాత జాతర నువ్వు చూసిందే కదా?"

ఆ మాట అంటూ కొండారెడ్డి మామ బీడీ నలిపి నోట్లో పెట్టుకొన్నాడు.

చినికి చినికి గాలివానగా మారినట్లు ఎంగిలితో ఆరంభమై రక్తపాతంతో ముగిసిన ఆ

దుర్ఘటన నా గుండెల్ని తోడేస్తూ ఉంది.

"అప్పుడు నా ఆలోచన దున్నపోతు మీదికి మళ్లింది. ఈ వ్యవస్థలో మాలమాదిగల మనస్తత్వం నిజంగా దున్నపోతు మనస్తత్వమే! వీళ్లదొక కొమ్ము. వాళ్లదొక కొమ్ము. ఈ రెండు కొమ్ములు ఏకమై ఉంటే - దున్నపోతు తిరగబడేది. బలి ఆగేది. ఎదగని ఈ మనస్తత్వాల్తో రెండు కొమ్ములు ఒకటై ఈ ఘోరాలాగుతాయా?" అని ఆలోచిస్తున్నాను.

కొండారెడ్డి మామ మాత్రం బీడీ పొగ అందాల్ని గమనిస్తున్నాడు.

"అవును మామా? ఈపూట ఏదో సాకు పెట్టి వాళ్లను వేరు చేశావు. రేపు వాళ్లు పనికొస్తానంటే వీళ్లు రారు. వీళ్లొస్తానంటే వాళ్లు రారు. ఒకరు తొక్కిన నేల యింకొకరు తొక్కనని భీష్మించి కూర్చుంటారు. అప్పుడేం చేస్తావ్ మామా?"అని అడగాలనుకొన్నా. నా వెర్రిగానీ!- రైలుపట్టాల వంటి మాల మాదిగల మనస్తత్వాలు కలవనంతకాలం కొండారెడ్డి మామకు ఇలాంటి జాతర్లకేం కొదవ?-

నా సందేహాన్ని పసిగట్టినట్టుగా కొండారెడ్డిమామ-

"అప్పుడేం జాతర జరిపించాల్నో?"అన్నట్టుగా ఎటో చూస్తూ బీడి దమ్ముమీంద దమ్ములాగుతున్నాడు!●

*- ఆంధ్రప్రభ ఉగాది ప్రత్యేక సంచిక 1987*

***(ఉగాది కథల పోటీలో ప్రథమ బహుమతి)***